సాక్షి
మెదక్
శనివారం । 27 । జనవరి । 2024

జాతీయ జెండా రంగు అలంకరణలో దర్శనమిస్తున్న దుర్గమ్మ



ముువ్వన్నెల రంగులో వనదుర్గమ్మ అలంకరణ

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఏడుపాయల వన దుర్గమ్మను జాతీయ జెండా రంగులో ఉన్న పూల దండలతో పూజారులు శంకర శర్మ, పార్థివ శర్మ అలంకరించారు. ఏటా అమ్మను జెండా రంగుల్లో అలంకరించడం ఆనవాయితీగా వస్తుంది.

– పాపన్నపేట(మెదక్):

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ జావేద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు తదితర కరెంట్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజలు గమనించి తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మెదక్ ఖిల్లాపై జెండావిష్కరణ



వేడుకల్లో ఎమ్మెల్యే రోహిత్‌రావు, కాంగ్రెస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఖిల్లాపై ఎమ్మెల్యే రోహిత్‌రావు జెండావిష్కరణ గావించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ దుకాణాలకు బహిరంగ వేలం వేయాలి

- సీఎంకు పోస్టుకార్డులు రాసిన ఎమ్మార్పీఎస్



సీఎంకు పంపే ముందు పోస్ట్‌కార్డులను చూపుతున్న నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని పాత బస్టాండ్ ఎదుట గల మున్సిపల్ షాపింగ్ దుకాణాలకు వెంటనే బహిరంగ వేలం నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్‌కార్డులపై రాసి పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎంతో మంది దళిత యువకులు, ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ దుకాణాలు పూర్తిగా బినామీల చేతుల్లో ఉన్నాయన్నారు. స్వాధీనం చేసుకొని రీటెండర్ వేయాలని డిమాండ్ చేశారు. తద్వారా నిరుద్యోగుల స్వయం ఉపాధికి అవకాశం లభిస్తున్నారు. నాయకులు బాల్‌రాజ్, ప్రవీణ్, ప్రభాకర్, లక్ష్మణ్, రాములు, నాగరాజు, సురేష్, ఆనంద్, జగదీష్, సుధాకర్, అరవింద్, మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూరియ కొరత లేదు



ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఏడీఏ

కొల్చారం(నర్సాపూర్): యాసంగిలో యూరియ కొరత రాకుండా అన్ని చర్యలూ.. చేపట్టినట్లు కొడిపల్లి ఏడీఏ పుణ్యవతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రంగంపేటలో గల పీఏసీఎస్, మణికంఠ, సాయిరాం ఫర్టిలైజర్లను ఏఓ శ్వేతా కుమార్‌తో కలిసి ఆమె తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, అమ్మకానికి సంబంధించిన రశీదు పుస్తకాలను పరిశీలించారు. దుకాణాల్లో ఉన్న ప్రస్తుత నిల్వలను తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ఎరువులు, ఇతర పురుగు మందులను ఎమ్మార్పీకే అమ్మాలని యజమానులను ఆదేశించారు. రైతులకు కనిపించేలా స్టాక్ బోర్డులు, ధరల పట్టీని దుకాణం ఎదుట ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

మెదక్ మున్సిపాలిటీ: గణతంత్ర వేడుకలు నిర్వహిస్తున్న దళితులను అడ్డుకొని భయభ్రాంతులకు గురి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయం వద్ద వారు మాట్లాడారు. పాపన్నపేట మండలం కొత్త లింగాయపల్లి గ్రామంలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ ప్రజలంతా జాతీయ జెండా ఆవిష్కరిస్తుండగా అదే గ్రామానికి చెందిన అగ్రకులాలు కక్ష పూరితంగా దుర్భాషలాడి అవమానపర్చారని విమర్శించారు. ఈ విషయమై ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. నాయకులు రామస్వామి, ప్రకాష్ రాథోడ్, బాలరాజ్ గోపాల్ నాయక్, స్వామి నాయక్, రవి, స్వామి నాయక్, వీరేందర్ నాయక్, సురేందర్, సురేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో జిల్లాను అగ్రగామిగా నిలబెడతాం

- రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలి
- కలెక్టర్ రాజర్షిషా
- పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవం



మెదక్ కలెక్టరేట్: పరేడ్ గ్రౌండ్‌లో జెండావిష్కరణ గావిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల అమలులో మెదక్ జిల్లా ముందంజలో ఉంటుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రాజ్యాంగ ఫలాలు అందరికీ అందినప్పుడే దాని స్ఫూర్తి నెరవేరుతుందన్నారు. శుక్రవారం పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎందరో మహనీయుల త్యాగ ఫలాలను అందరికీ అందాలనే సంకల్పంతో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని 1950 జనవరి 26న మనకు అందించారన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు పథకాలు వినియోగంలోకి వచ్చాయన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా డిసెంబర్ 12న ప్రారంభమైందన్నారు. జిల్లాలో మహిళలందరూ ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారన్నారు. ఈ పథకం ప్రారంభం తరువాత జిల్లాలోని మెదక్, నర్సాపూర్ బస్‌డిపోల పరిధిలో ప్రయాణికులు గణనీయంగా పెరిగారన్నారు. ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రజలందరికీ రూ.10 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందుతుందని చెప్పారు. 6 గ్యారంటీల పథకాల అమలు చేయడానికే జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా 2023 డిసెంబర్ 28 నుంచి 2024 జనవరి 6 వరకు గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించామన్నారు. అర్హులైన మహిళలకు ప్రతి నెలా రూ. 2,500 ఆర్థిక సహాయం అందజేస్తామని, రూ.500లకే సిలిండర్‌ను ఇవ్వనున్నామని చెప్పారు. అందుకు జిల్లాలో 1,87,883 మంది మహిళలు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. గ్యాస్ సబ్సిడీ కోసం 1,95,377 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు చెప్పారు. అలాగే రైతుభరోసా కింద రైతులు, కౌలురైతులకు ప్రతి ఏటా ఎకరానికి రూ.15 వేలు, కౌలు రైతులకు రూ. 12 వేలు ఆర్థిక సహాయం ఇవ్వనున్నామన్నారు. ఈ పథకం కోసం 1,45,777 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇల్లులేని అర్హులైన వారికి ఆర్థిక సహాయం కింద రూ. 5 లక్షలు ఇవ్వనున్నామని చెప్పారు. తెలంగాణ ఉద్యమ కారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. అందుకు 405 దరఖాస్తులు రాగా ఇళ్ల కోసం 1,93,169 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికీ ప్రతినెలా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. ఈ పథకం కోసం 1,74,016 దరఖాస్తులు వచ్చాయన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా...

మెదక్ జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరానికి 10వ, తరగతి, ఇంటర్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు గానూ ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా జెడ్జి లక్ష్మీశారద, అదనపు కలెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు, ఎస్పీ బాలస్వామి పాల్గొన్నారు.

చేయూత పథకం...

దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పింఛన్, వృద్ధులకు, వితంతువులకు, గీతా కార్మికులకు, చేనేత కార్మికులకు, డయాలసిస్, ఎయిడ్స్ బాధితులకు, బీడీ కార్మికులకు, ఫైలేరియా, ఒంటరి మహిళలకు, బీడీ టేకేదారులకు నెలకు రూ. 4 వేల చొప్పున పింఛన్ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. పథకం దివ్యాంగుల నుంచి 4,685 దరఖాస్తులు రాగా ఇతరులకు సంబంధించి 46,960 దరఖాస్తులు వచ్చాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,25,680 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. వాటిని కంప్యూటరీకరణ చేశామన్నారు. ఈ ఆరు గ్యారంటీల దరఖాస్తులు, వివిధ రకాల సమస్యలకు సంబంధించి మరో 50,032 దరఖాస్తులు వచ్చాయన్నారు.





ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మెదక్ కలెక్టరేట్: శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అటవీశాఖ అడవుల అభివృద్ధిపై, పట్టణ పేదరిక నిర్మూలన(మెప్మా), వృత్తి నైపుణ్య శకటం, క్రీడల శాఖ భారీ జాతీయ పతాకం, జాతీయ ఓటరు దినోత్సవ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆరు గ్యారంటీలు, ప్రజా పాలన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం కలెక్టర్ రాజర్షిషా, జెడ్పీచైర్ పర్సన్ హేమలత... స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు, యోగా కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు రాజర్షిషా, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, హేమలత అందజేశారు.



మెదక్ కలెక్టరేట్: మెప్మా శకటం



భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం



పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్



అవార్డు అందుకుంటున్న జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

- పోలీస్ రంగంలో అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నది మేమే
- ఎస్పీ బాలస్వామి స్పష్టీకరణ



ఎస్పీ కార్యాలయం వద్ద జెండావిష్కరణ చేస్తున్న బాలస్వామి

మెదక్ మున్సిపాలిటీ: తోటి వారి పట్ల మంచితనంతో మెలిగి మానవ జన్మను సార్థకత చేసుకోవాలని ఎస్పీ డాక్టర్ బాలస్వామి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ అతిపెద్ద భారత రాజ్యాంగాన్ని రచించి దేశానికి దిశా నిర్దేశం చేశారని గుర్తు చేశారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన చట్టం ప్రకారం నీతి నిజాయితీతో పారదర్శకతతో ధనిక, పేద తేడా లేకుండా ప్రజలందరినీ సమానంగా చూడాలన్నారు. ప్రజల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది మమేకమై విధులు నిర్వహించాలన్నారు. అప్పుడే వారి మదిలో చేసిన సేవలు గుర్తిండిపోతాయన్నారు. తెలంగాణ పోలీసులు దేశంలోనే అత్యున్నత ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నది కేవలం పోలీస్ వ్యవస్థే అన్నారు. అలాగే విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ బాలస్వామి.. సేవా పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీకి బడ్జెట్ కేటాయించాలి

మెదక్ కలెక్టరేట్: గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయించకుండా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం(వ్యకాస) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో కిసాన్ సంయుక్త మోర్చా, ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం మాట్లాడారు. ఎన్డీఏ సర్కారు అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తెచ్చిందన్నారు. కనీస వేతనాలు నిర్ణయించే విధానానికి స్వస్తి పలికిందన్నారు. నెలకు రూ.26 వేల ఇచ్చేందుకు ససేమిరా అంటుందన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, వెల్ఫేర్ బోర్డులను సైతం నిర్వీర్యం చేస్తోందన్నారు. రెండు కోట్ల ఉద్యోగాల హామీని కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని దుయ్యబట్టారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. ఫిబ్రవరి 16న చేపట్టే దేశ వ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌కు అన్ని తరగతులవారు తరలిరావాలన్నారు.

నిధులివ్వకుంటే ఆందోళన చేస్తాం



ముగ్గుల పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

- ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం అవసరం ఉన్న నిధులు మంజూరు చేయకుంటే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఎమ్మెల్యే సునీతారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధి కొత్తపేట గ్రామంలో రూ.70 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశానికి సర్పంచ్ ర్యావ సాన్వి అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి కోసం మంజూరైన నిధులు రద్దు చేయడం సరికాదన్నారు. వెంటనే వాటిని పునరుద్ధరించాలన్నారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు క్వింటాలుకు రూ.500ల బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారని, ఆచరణలోకి తేవాలన్నారు. ప్రజాపాలనలో ద్వారా అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారన్నారు. వారి ఎంపికలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. పెన్షన్‌దారుల వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వారికి రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు చంద్రగౌడ్, యాదగౌడ్, నర్సింహారెడ్డి, పవన్‌గుప్తా, శేఖర్‌గౌడ్, భిక్షపతిరెడ్డి, మైపాల్‌రెడ్డి, చింత స్వామి, మహేందర్‌రెడ్డి, నర్సింగరావు ఉన్నారు.

క్రీడల్లో రాణించాలి

యువకులు, విద్యార్థులు వారికి నచ్చిన క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. కొత్తపేట సర్పంచ్ సాన్వి, వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డిలు కొత్తపేటలో యువకులు, విద్యార్థులకు క్రీడా పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

న్యాయ సహాయానికి 'లీగల్ ఎయిడ్ క్లినిక్ '

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద

మెదక్ కలెక్టరేట్: ఉచిత న్యాయ సహకారం అందించేందుకు లీగల్ ఎయిడ్ క్లినిక్ పనిచేస్తోందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద తెలిపారు. శుక్రవారం 75 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్‌లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సైతం ప్రారంభించి, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. పలు కేసుల్లో న్యాయ సహాయం కోసమే ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ప్యానెల్ అడ్వకేట్.. పారా లీగల్ వలంటీర్ ద్వారా చట్టం గురించి తెలియజేస్తోందని చెప్పారు. సివిల్, బ్యాంకు, ఫైనాన్స్, ప్రైవేట్ కేసులు, కుటుంబ తగదాలు, ఆస్తి తగాదాలు వంటి కేసుల్లోనూ ఉచిత న్యాయ సహాయం అందిస్తోందన్నారు. ఇది రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ జితేందర్, జూనియర్ సివిల్ జడ్జి రిటాలాల్ చంద్ , మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ చీఫ్ కల్పన ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద

అమ్మవారికి పూజలు చేయలేదని..

- బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

హవేళిఘణాపూర్(మెదక్): అమ్మవారికి కుటుంబసభ్యులు పూజలు చేయలేదని మనస్తాపం చెందిన ఓ వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండల పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శమ్నాపూర్ గ్రామానికి చెందిన దుర్గమ్మ(70) గురువారం రాత్రి తనకు తీవ్ర తలనొప్పి వస్తుందని చెప్పగా కుటుంబ సభ్యులు శుక్రవారం ఆస్పత్రికి తీసుకెళ్తామన్నారు. తాను దుర్గమ్మకు పూజలు చేయాలని చెప్పినా ఒక్కరూ కూడా చెవికెక్కించుకోవడం లేదని మనస్తాపం చెందింది. దీంతో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంటికి పక్కనున్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె కోసం ఇంట్లో, బయట వెతుకుతుండగా బావిలో మృతదేహాన్ని గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

క్లుప్తంగా

సమ్మక్క, సారలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జాతర నిర్వాహకులు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని కూటిగల్ గ్రామంలో ఫిబ్రవరిలో జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర పోస్టర్‌ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను సూచించారు.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా ప్రాజెక్టులు



ప్రాజెక్టులతో సుష్మ



రితేష్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/మర్కూక్(గజ్వేల్): దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌లు శుక్రవారం తెలిపారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి 10 ప్రాజెక్టులు ఎంపికవ్వగా అందులో రెండు ప్రాజెక్టులు దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాయన్నారు. మర్కూక్ మండల పరిధిలోని జెడ్పీహెచ్‌ఎస్ దామరకుంటలో 9 తరగతి చదువుతున్న విద్యార్థిని సుష్మ, సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని స్ప్రింగ్ డల్స్ పాఠశాలలో చదువుతున్న రితేష్‌ల ప్రాజెక్టులు ఎంపికయ్యాయన్నారు. ఈ ప్రాజెక్టులు దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో రాణిస్తే, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక అవుతారని తెలిపారు. విద్యార్థులను గైడ్ టీచర్లు బ్రహ్మయ్య, కృష్ణకుమార్‌లను అభినందించారు.

బాల నేరస్తులకు న్యాయ సహాయం



మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్: నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతి రెడ్డి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో శుక్రవారం సిద్దిపేట కోర్టులో సమావేశం నిర్వహించారు. జైలులో ఉన్న బాల నేరస్తులను గుర్తించడం, వారికి న్యాయ సహాయం అందించడం అనే అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జైలులో ఉన్న 18 నుంచి 22 ఏళ్ల వయసు ఉన్న ఖైదీలను గుర్తించి న్యాయ సహాయం అందిస్తామని పేర్కొన్నారు. పాన్ ఇండియా ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

వెల్దుర్తి(తూప్రాన్): మద్యం మత్తులో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్దుర్తి పంచాయతీ పరిధి ఎల్కపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కానికె వెంకటేశ్(45) శుక్రవారం ఉదయం లేవలేదు. ఇంటి తలుపులు మూసి ఉండడాన్ని గమనించి చుట్టుపక్కల వారు వచ్చి చూడగా ఉరేసుకొని కనిపించాడు. తాగుడుకు బానిసై మద్యం మత్తులో వెంకటేశ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్ వెల్లడించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఉత్తములు వీరే..

సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని పలువురు ఉన్నతాధికారులు, అధికారులు, పోలీసుల సేవలకు అవార్డులు వరించాయి. విధి నిర్వహణలో ప్రతిభ, సమయస్ఫూర్తిని ప్రదర్శించినందుకు ఉత్తమ సేవా వార్డులకు ఎంపికయ్యారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఆయా జిల్లాల కలెక్టరేట్‌లలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి, మెదక్ కలెక్టర్ రాజర్షిషా చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

-సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



(కుడి నుంచి ఎడమకు)

సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి చేతుల మీదుగా పత్రాలు అందుకుంటున్న చంద్రశేఖర్, మాధురి, రూపేష్, నగేశ్, శ్రీనివాస్, ఎల్లయ్య, రవీందర్, సురేశ్ మోహన్, జగదీష్, వనజాత, సుగుణ భాయ్, పరమేశం, దశరథ్, నాగేశ్వరరావు, ఫర్వీన్ షేక్, విజయలక్ష్మీ, కార్తీక్



కిరణ్ కుమార్, అరుణోదయ చారి, నందకిషోర్, కార్తీక్ , ప్రవీణ్ రెడ్డి, రాహుల్, అరుణ్, పాషా , మహేందర్, సాయి, మల్లప్ప, మల్లేష్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, ఖదీర్, సుభాష్, సలాం, సాయిలు, (కుడి నుంచి ఎడమకు)



సుభాష్, నారాయణ, వెంకటేశ్వర రెడ్డి, జయంతి, డాక్టర్ అశోక్, సుజాత, ఉదయ్ కుమార్, విజయలక్ష్మి, అనీల్ కుమార్, శ్రీధర్, ప్రదీప్, రవీందర్, అంజయ్య, సమద్, రామాచారి, కృష్ణ (కుడి నుంచి ఎడమకు)



మెదక్ కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, వసురాం, నరేందర్ రెడ్డి, ఉమాదేవి, హన్మంత్, సందీప్, రామయ్య, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్

ప్రతీ ఆలోచన వెనుక ఓ సైన్స్

- ప్రజల్లో గొప్ప చైతన్యానికి నాంది
- అందరూ శాఖాహారులుగా మారాలి
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



శాఖాహారుల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేటజోన్: ప్రతీ ఆలోచన వెనుక ఓ సైన్స్ ఉంటుందని, అలాగే శాఖాహారం వెనుకా సైన్స్ ఉందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం కొండ మల్లయ్య గార్డెన్స్‌లో శాఖాహారుల మెగా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో ఒక్క శాతం మాత్రమే శాఖాహారులు ఉన్నారని, మిగతా అంత కూడా మాంసాహారులని పేర్కొన్నారు. శాఖారుల సంఖ్య పెరగాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం పట్టణ వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, ప్రతినిధులు పాండు, రవి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు క్యాంపు కార్యాలయంలో అయోధ్య ప్రత్యేక అతిథిగా వెళ్లి వచ్చిన వైద్యులు అరవింద్ ఎమ్మెల్యే హరీశ్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

రైతులకు అవగాహన కల్పించాలి

నియోజకవర్గ పరిధిలోని రైతులను గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో కలిసి అధికారులు వ్యవసాయ సాగు సూచనలు చేసి మరింత అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే హరీశ్ రావు సూచించారు. క్యాంపు కార్యాలయం నుంచి నియోజకవర్గ పరిధిలోని వ్యవసాయ శాఖ అధికారులతో శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో ప్రధాన పంట వరి వల్ల ప్రతీ సంవత్సరం పంట మార్పిడి లేక మొగి పురుగు ఉధృతి పెరుగుతుందని పేర్కొన్నారు. దీనిపై రైతులను చైతన్యం చేయాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల సాగునీరు పెరిగి యాసంగి లో వరికి రైతులు మక్కువ చూపుతున్నారని పేర్కొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్ విలేజ్ అవార్డులు



అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు



విద్యార్థిని సన్మానిస్తున్న సర్పంచ్ సంజీవరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): ఇంటింటా ఇన్నోవేటర్ విలేజ్ ఇన్నోవేషన్ అవార్డ్–2024 విన్నర్ శామంతుల అనిల్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. శుక్రవారం రాష్ట్రప్రభుత్వం 20 జిల్లాల్లోని 44 మంది ఇన్నోవేటర్స్ విజేతలను ప్రకటించింది. ఇందులో మద్దూరు మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన శామంతుల అనిల్‌కుమార్ ఉన్నారు. గ్రామ సర్పంచ్ బద్దిపడగ లలితా కృష్ణారెడ్డి, గ్రామ కార్యదర్శి భాస్కర్ అనీల్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు రజిత, రేణుక అంగన్‌వాడీ టీచర్ సునీత, సీఏలు రేణుక, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): ఇంటింటా ఇన్నోవేటర్ విలేజ్ ఇన్నోవేషన్ అవార్డును నాగ్సాన్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి విగ్నేష్ గెలుపొందారు. ఈ సందర్భంగా శుక్రవారం సర్పంచ్ సంజీవరెడ్డి విద్యార్థిని సన్మానించారు. అతడితోపాటు అడ్జస్టబుల్ వాలీబాల్ నెట్ ఆవిష్కరణ చేసి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన అదే పాఠశాల విద్యార్థి ఆదిత్య వర్ధన్‌ను సన్మానించారు.

సైన్స్ ఫెయిర్‌లో ఆకట్టుకున్న సచివాలయ నమూనా



సచివాలయ నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హీరా ఫౌండేషన్ స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన నమూనాలను తిలకించారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు తయారు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయ నమూనా ఎమ్మెల్యేను ఆకట్టుకుంది. అనంతరం ఉత్తమ నమూనాలకు బహుమతులను ప్రధానం చేశారు.

అక్రమ ఇసుక రవాణా

ఐదు వాహనాలను పట్టుకున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న ఐదు వాహనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సీఐలు రమేశ్, నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ చౌరస్తా కుంకుమ మిల్లు వద్ద లారీ, మినీ టిప్పర్, బోలేరో వాహనంలో, చిన్నకోడూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు లారీల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి వెళ్లి పట్టుకున్నామన్నారు. వాహనాలను సంబంధిత పోలీసు స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏదైనా సమాచారం ఉంటే సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూం 87126 67100, టాస్క్‌ఫోర్స్ అధికారులు 87126 67447కు సమాచారం అందించాలని సూచించారు.

చిన్నారుల్లో మేధాశక్తి పెరుగుతుంది



చిన్నారికి డ్రాప్స్ వేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఆయుర్వేద మందు చిన్నారుల్లో మేధాశక్తి పెరగడానికి దోహదపడుతుందని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ కల్పనా ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు స్వర్ణామృత ప్రాశన ఆయుర్వేద మందు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై చిన్నారులకు డ్రాప్స్ వేశారు. కార్యక్రమంలో క్లబ్ జోనల్ చైర్మన్ రాజ్‌కుమార్, బాధ్యులు సాయికుమార్, వెంకట్‌రావు, పండరిరెడ్డి, వినోద్ పాటిల్, జైపాల్‌రెడ్డి, మన్మథ కిషోర్, ప్రసన్నకుమార్, జ్ఞానేశ్వర్‌గౌడ్, అనిల్‌గౌడ్, నర్సింహులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి

నారాయణఖేడ్‌లో ఈనెల 30న ఉదయం 10గంటల నుంచి పట్లోళ్ల కిష్టారెడ్డి ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ హోలిస్టిక్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించనున్న ఉచిత గుండె, సాధారణ వైద్య శిబిరాన్ని ఖేడ్ నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి కోరారు. ఆయన స్వగృహం ఆవరణలో శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రమేశ్ చౌహాన్, శంకర్ ముదిరాజ్, దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్యా.. ఆత్మహత్యా?

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్



నరేశ్ (ఫైల్)

ములుగు(గజ్వేల్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన ములుగు మండలం బహిలంపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు మండలం బహిలంపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన గువ్వ నరేశ్(30)కు తొమ్మిదేళ్ల కిందట క్షీరసాగర్‌కు చెందిన లతతో వివాహమైంది. వీరికి తొమ్మిదేళ్ల లోపు అక్షయ, లిపిత్, వంశీ ఉన్నారు. నరేశ్ సమీప పరిశ్రమలో కార్మికుడు కాగా, భార్య దినసరి కూలీ. సంసారం విషయంలో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో నరేశ్ ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అదే రాత్రి మృతుడి భార్య లత సమీపంలోని మామ మల్లేశ్ ఇంటికి వెళ్లి భర్త నరేశ్ ఉరి వేసుకొని చనిపోయాడని తెలిపింది. అతడు వచ్చి చూడగా బెడ్‌రూం పైన సీలింగ్ కొక్కానికి చీర వేలాడుతూ కనిపించగా, నరేశ్ కింద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గదిలో బట్టలన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. నరేశ్ మృతిపై తండ్రి మల్లేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. తనంతట తానే ఉరేసుకున్నాడా లేదా మరెవరైనా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా అని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



స్వామి (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, భూంపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోత్రాల స్వామి (39) కూలీ పనులు చేసుకుంటూ భార్య రేణుక, పదేళ్లలోపు ఇద్దకు కుమారులను పోషించుకుంటున్నాడు. ఏడేళ్ల క్రితం సుమారు రూ.10 లక్షల వరకు అప్పు చేసి ఇంటిని నిర్మించుకున్నాడు. అప్పులు ఎక్కువై రెండేళ్ల క్రితం బతుకు దెరువు కోసం మస్కట్‌కు వలస వెళ్లాడు. అక్కడా సరైన పని దొరక్క 15 రోజుల క్రితం స్వగ్రామమైన మోతెకు తిరిగి వచ్చాడు. అప్పుల వారి నుంచి ఒత్తిడి రావడంతో ఇంట్లో గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో భార్య రేణుక పుట్టినిళ్లు హుజూరాబాద్ మండలం తోకలపల్లికి వెళ్లింది. అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపానికి గురైన స్వామి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకున్నాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భూంపల్లి ఎస్‌ఐ భువనేశ్వర్‌రావు తెలిపారు.

నీటి కెనాల్‌లో పడి కార్మికుడు మృతి



ఘటనా స్థలంలో ఖదీర్ మృతదేహం

సంగారెడ్డి టౌన్: ప్రమాదవశాత్తు నీటి కెనాల్‌లో పడి కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఫసల్ వాది గ్రామానికి చెందిన ఖదీర్ (36) గణపతి చక్కెర పరిశ్రమలో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. పరిశ్రమ ఆవరణలో ఉన్న నీటి కెనాల్ లో శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు కాలుజారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిలల్లు ఉన్నారు. పరిశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆర్థికంగా ఆదుకుంటామని పరిశ్రమ యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనా స్థలంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, సంగారెడ్డి రూరల్ సీఐ సుధీర్ కుమార్, ఎస్సై రాజేశ్ నాయక్ యాజమాన్యం ఉన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

అక్కడికక్కడే ఆటో డ్రైవర్ మృతి

పటాన్‌చెరుటౌన్: ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. భానుర్‌కి చెందిన అంజిరెడ్డి(39) బీడీఎల్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తుంటూ ఖాళీ సమయంలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి అంజిరెడ్డి ఆటో తీసుకొని శంకర్‌పల్లి వైపు నుంచి పటాన్‌చెరు వైపు వస్తున్నాడు. బీడీఎల్ పరిశ్రమ సమీపంలోకి రాగానే ఆటో యూటర్న్ చేస్తుండగా పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా అంజిరెడ్డి పై పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య చంద్రకళ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.